



భౌ భౌ

- జిల్లాలో రెచ్చిపోతున్న వీధి కుక్కలు
- రోడ్డు వెంట వెళ్లాలంటేనే జంకుతున్న కాలనీ వాసులు
- ఇటీవల కుక్కల దాడిలో కృష్ణజింక మృతి
- తాజాగా బాలుడిపై దాడి చేసిన కుక్కలు
- పట్టించుకోని జిల్లా యంత్రాంగం



కుక్కల దాడిలో గాయపడిన బాలుడు వరుణ్ తేజ్



ఇటీవల సాలూరలోని తగ్గెల్లిలో కృష్ణ జింకను చంపిన కుక్కలు



డొంకేశ్వర్ మండలం సిర్పూర్‌లో కుక్కల దాడిలో గాయపడిన జింక


బోధన్‌రూరల్, ఆగస్టు 8: జిల్లాలో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. రోడ్లు, వీధుల్లో వీరంగం సృష్టిస్తున్నాయి. ఒంటరిగా వెళ్లే వారిపై దాడులు చేసి గాయాలపాలు చేస్తున్నాయి. జంతువులపై సైతం దాడులు చేసి చంపేస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా వీధి కుక్కల సంఖ్యను తగ్గించేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టినట్లు అధికారులు చెబుతున్నా దాని ఫలితాలు మాత్రం కనపడడం లేదు. కుక్కలకు కు.ని ఆపరేషన్లు చేపడుతున్నా జిల్లాలో వేల సంఖ్యలో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. బోధన్ పట్టణంలోని హనుమాన్ టికిడిలో గురువారం కుక్కలు స్వైర విహారం చేశాయి. కాలనీలో ఆడుకుంటున్న వరుణ్ తేజ్ నాలుగు సంవత్సరాల బాలుడిపై ఒక్కసారిగా దాడి చేశాయి. దీంతో తల, చెంపలకు గాయాలయ్యాయి. బాలుడిని తప్పించబోయిన మహిళలపై కాళ్లపై దాడి చేశాయి. దీంతో వార్డు కౌన్సిలర్ సుధారాణి ఘటనా స్థలానికి చేరుకుని బాలుడిని చికిత్స నిమిత్తం బోధన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇటీవల సాలూర మండలంలోని తగ్గెల్లి గ్రామంలో వీధి కుక్కలు కృష్ణ జింకను వేటాడి చంపేశాయి. అలాగే డొంకేశ్వర్ మండలంలోని సిర్పూర్ ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ప్రాంతంలో నీటి ప్రవాహం పెరుగుతున్నా కొద్ది జింకలకు అవాసం లేక గ్రామాల్లోకి వస్తున్నాయి. దీంతో కుక్కలు జింకలపై దాడులకు పాల్పడుతున్నాయి. తాజాగా సిర్పూర్ ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ప్రాంతంలో ఉన్న ఓ జింకపై కుక్కలు దాడి చేశాయి. దీంతో స్థానికులు జింకకు చికిత్స అందించి చిన్నాపూర్ అర్బన్ పార్కు ముందు పరిశీలనకు ఉంచారు.

నిత్యం ఏదో ఒక చోట కుక్కల దాడులు

బోధన్ డివిజన్‌లో ఎడపల్లి, రెంజల్, నవీపేట, కోటగిరి, రుద్రూర్, పోతంగల్, మోస్రా, చందూర్ మండలాల్లో నిత్యం ఏదో ఒక చోట పిల్లలు, పెద్దలపై కుక్కల దాడులు జరుగుతూనే ఉన్నాయి. బోధన్ పట్టణంలోని సాయిబాబా కమాన్ నుంచి గంజ్ వెళ్లే రోడ్డు, పాత బస్టీ, పోస్టాఫీస్, ఆచన్‌పల్లి, శక్కర్‌నగర్, తదితర ప్రాంతాల్లో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి.

గ్రామాల్లో భయం.. భయం

సాలూర, బోధన్ మండలంలోని గ్రామాలలో వీధి కుక్కలతో ప్రజలు రాత్రుళ్ల భయంభయంగా గడుపుతున్నారు. గ్రామాలల్లో వీధి కుక్కలు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. దీంతో దారి వెంట వెళ్లే ప్రజలు వణుకుతున్నారు. రోడ్డు వెంట వెళ్తున్న ప్రజలపై ఒక్కసారిగా దాడి చేసి గాయపరుస్తున్నాయి. దీంతో గ్రామాలల్లో ప్రజలు వీధి కుక్కలను చూసి భయంభయంగా గడుపుతున్నారు. చిన్నారులను బయటకు పంపాలంటే జంకుతున్నారు. కుక్కలను పట్టుకుని ఆపరేషన్ చేస్తున్నారే తప్ప.. గ్రామాల్లో నివారణపై ప్రత్యేక దృష్టి కేటాయించడం లేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాలల్లో వీధుల గుండా ద్విచక్రవాహనాలు, సైకిళ్లపై వెళ్లే ప్రయాణికులను కుక్కలు వెంబడించి దాడి చేయడంతో గాయపడుతున్నారు. కుక్కల సంతానోత్పత్తి తగ్గించడానికి డివిజన్ కేంద్రంలో యూనియన్ బర్త్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. గ్రామాలల్లో కుక్కలను పట్టుకువచ్చి వాటికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు చేసి వాటిని దూరంగా వదిలేస్తుంటారు. అవి మళ్లీ తిరిగి గ్రామాలు, పట్టణాల్లోకి వెళ్తున్నారు. దీంతో ప్రజలు వీధి కుక్కల దాడులతో భయపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కుక్కల దాడుల నుంచి ప్రజలను రక్షించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



• నిజాంసాగర్

వానలు కురుస్తున్నా.. నిండని ప్రాజెక్టులు

- జిల్లాలోని పలు చెరువులు, ప్రాజెక్టుల్లోకి చేరుకోని పూర్తిస్థాయి నీటి మట్టం
- నిజాంసాగర్ ఎగువన సింగూరుకు రాని వరద
- వానాకాలం పంటకు ఢోకా లేకున్నా.. యాసంగి సాగు పైనే రైతుల ఆందోళన

నిజామాబాద్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వానాకాలం మొదలై రెండు నెలలు గడిచినా శ్రీరాంసాగర్, నిజాంసాగర్ ప్రాజెక్టులకు పూర్తిస్థాయి నీటిమట్టం చేరుకోలేదు. శ్రీరాంసాగర్ సగం వరకు నిండినా నిజాంసాగర్‌కు మాత్రం ఒక్క టీఎంసీ కూడా నీరు చేరలేదు. ఈ రెండు ప్రాజెక్టుపై ఆధారపడి జిల్లా రైతులు వ్యవసాయం చేస్తున్నారు. ఇతర జిల్లాలకు మించి పంటలను పండిస్తున్నారు. ఈ రెండు ప్రాజెక్టులతో ఆధారపడి పంటలు వేస్తున్న రైతులు వానాకాలం చేతికొచ్చే అవకాశం ఉన్నా భారీ వర్షాలు పడకుంటే యాసంగిలో ఇబ్బందులు ఎదురవుతాయని ఆందోళన చెందుతున్నారు. గత సంవత్సరం లాగా భారీ వర్షాలు పడి ప్రాజెక్టులు నిండితేనే తమకు రెండో పంటకు అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. ఎగువన ఉన్న సింగూరు కూడా వరద రాకపోవడంతో ఈ ప్రాజెక్టు కింద ఉన్న ఆయకట్టుకు నీటి ఎద్దడి ఏర్పడే పరిస్థితులు ఎదురవుతున్నాయి. వానాకాలం సాగుకు నీటి విడుదల కొనసాగిస్తున్నా యాసంగికి మాత్రం ప్రస్తుతం ఉన్న నీటి నిల్వలతో అందించే పరిస్థితి లేదు.

జిల్లాలో కురవని భారీ వర్షాలు

జిల్లాలో ఈ యేడాది భారీ వర్షాలు ఎక్కువగా పడకపోవడం వల్ల శ్రీరాంసాగర్, నిజాంసాగర్ ప్రాజెక్టులకు నీళ్లు రాలేదు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు కొంత మేరకు మహారాష్ట్రలో పడిన వర్షాలతో నీళ్లు వచ్చిన నిజాంసాగర్‌కు మాత్రం ఈ సంవత్సరం ఇప్పటి వరకు భారీ వరదలు రాలేదు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఎగువన ఉన్న అందూరా, విష్ణుపురి, బాలేగామ్ ప్రాజెక్టులు నిండటం వల్ల కొంతమేర వరద వచ్చింది. ప్రాజెక్టులోకి గతనెల మూడో వారం నుంచి ప్రతిరోజూ ఒక టీఎంసీ నుంచి రెండు టీఎంసీల వరకు వరద వచ్చి చేరింది. విష్ణుపురి గేట్లు ఎత్తడం వల్ల ఎక్కువ మొత్తంలో నీళ్లు వచ్చి చేరాయి. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులకు గాను ప్రస్తుతం 1080.8 అడుగులకు నీళ్లు చేరాయి. ప్రాజెక్టు పూర్తిస్థాయి కెపాసిటీ 80.5 టీఎంసీలకు గాను 47.25 టీఎంసీలకు నీళ్లు చేరాయి. జిల్లాతో పాటు ఎగువన వర్షాలు పడటం వల్ల ఇప్పటి వరకు ప్రాజెక్టులోకి 41 టీఎంసీల వరకు వరద వచ్చి చేరింది. ప్రాజెక్టులో సగానికి పైగా నీళ్లు రావడం వల్ల ఆయకట్టుకు కూడా నీటి విడుదల చేపట్టారు. నిజాంసాగర్ ప్రాజెక్టులో ప్రస్తుతం ఈ పరిస్థితి లేదు. గత సంవత్సరం ఉన్న నీటి నిల్వలతోనే ఆయకట్టుకు గత నెల నుంచి నీటి విడుదల కొనసాగిస్తున్నారు. ప్రాజెక్టు పరిధిలోని లక్షా 25వేల ఎకరాల వరకు సాగునీటిని విడతల వారిగా అందిస్తున్నారు. ప్రాజెక్టు ఎగువన భారీ వర్షాలు పడకపోవడం వల్ల నీళ్లు రాలేదు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వచ్చిన విధంగానైనా ఈ ప్రాజెక్టులోకి నీళ్లు రాలేదు. వర్షాకాలంలో కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు పడిన ఈ ప్రాజెక్టు ఎగువన పడకపోవడం వల్ల కనీసం ఒక్క టీఎంసీ వరకైన నీళ్లు వచ్చి చేరలేదు.



నిజాంసాగర్‌లో 3.903 టీఎంసీల నీరు

నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగులకు గాను ప్రస్తుతం 1389.64 అడుగుల నీళ్లు ఉన్నాయి. ప్రాజెక్టు పూర్తిస్థాయి కెపాసిటీ 17.802 టీఎంసీలకు గాను ప్రస్తుతం 3.903 టీఎంసీల నీళ్లే ఉన్నాయి. వర్షాలు పడకపోవడం వల్ల వరద చేరకపోవడంతో నీటిమట్టాలు పెరగడం లేదు. ప్రతిరోజూ నీటిని ఆయకట్టుకు విడుదల చేయడం వల్ల తగ్గిపోతున్నాయి. ప్రాజెక్టు ఎగువన మంజీరా పరీవాహక ప్రాంతంలో వర్షాలు పడకపోవడం వల్ల వరద రావడం లేదు. ఈ ప్రాజెక్టు ఎగువన సింగూరు ప్రాజెక్టు ఉంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి కెపాసిటీ 29.917 కెపాసిటీ ఉన్నా భారీ వర్షాలు పడకపోవడం వల్ల ఈ ప్రాజెక్టులోనూ వరద చేరలేదు. ప్రాజెక్టులో కేవలం 14.803 టీఎంసీల నీళ్లు మాత్రమే ఉన్నాయి. కర్నాటక, మహారాష్ట్రలో ఎగువన వర్షాలు పడకపోవడం వల్ల మంజీరాకు వరద పెరగకపోవడం వల్ల సింగూరుకు కూడా వరద రాలేదు. సింగూరు నిండి గేట్లు ఎత్తితేనే మంజీరాకు వరద వస్తోంది. ఆ వరద నిజాంసాగర్‌కు వచ్చి చేరుతోంది. ఎగువన వర్షాలు లేకపోవడం వల్ల సింగూరులో కూడా సగానికి తక్కువగానే నీళ్లు ఉండటం వల్ల ఇబ్బందికర పరిస్థితులు ఈ ప్రాజెక్టు పరిధిలో ఉన్నాయి. ప్రస్తుతం వానాకాలం సీజన్‌కు ఉన్న నీటి నిల్వలు కొంతమేర సరిపోయిన యాసంగికి మాత్రం వరద రాకుంటే ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడే అవకాశం కనిపిస్తుంది. ఈ ప్రాజెక్టు పరిధిలో జిల్లాలో లక్షా 20వేల ఎకరాలు సాగు అవుతుంది. ఈ ప్రాజెక్టుతో పాటు శ్రీరాంసాగర్ పరిధిలో లక్ష్మి, చౌట్‌పల్లి హన్మంత్‌రెడ్డి, కాకతీయ కాలువ, గుత్ప అలీసాగర్ కింద మరో రెండులక్షల ఎకరాల వరకు సాగు అవుతుంది. ఈ రెండు ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో నిండితే రెండు పంటలు పండే అవకాశం ఉంది. జిల్లాలోని రైతులకు వానాకాలం పంటకు నీళ్లు అందుతున్నా వచ్చే రోజుల్లో భారీ వర్షాలు పడకుంటే ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉంది. సాగునీటి శాఖ అధికారులు మాత్రం ఇంకా వర్షాలకు రెండు నెలల సమయం ఉండటం వల్ల రెండు ప్రాజెక్టులలోకి నీళ్లు వస్తాయని అంచనా వేస్తున్నారు.



• ఎస్సారెస్పీ





• ఆలూర్-ఆర్మూర్ రోడ్డు ఇలా..

బురదమయంగా ఆర్మూర్, ఆలూరు రోడ్డు

- అడుగడుగునా గుంతలు
- వాహనాల రాకపోకలకు తప్పని తిప్పలు
- చిన్నపాటి వర్షానికే చెరువులను తలపిస్తున్న రహదారులు
- పట్టించుకోని సంబంధిత అధికారులు

ఆర్మూర్‌రూరల్, ఆగస్టు 8: జిల్లాలో కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు రహదారులు గుంతల మయంగా మారాయి. ఆర్మూర్, ఆలూర్ మండలాల మధ్య బైపాస్ రోడ్డు సమీపంలో రోడ్డు బురదమయమై వాహనదా రులకు ఇబ్బందులు తప్పడంలేదు. చిన్నపాటి వర్షానికే గుంతల్లో నీరు నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. ఆర్మూర్ నుంచి ఆలూర్, వెల్మల్, కల్లెడితో పాటు నందిపేట మండలానికి ఇదీ ప్రధాన రహదారి. ఈ రోడ్డు నిత్యం ప్రయాణికులతో వాహనాలతో రద్దీగా ఉంటుంది. అంతే గాకుండా ఆర్మూర్‌కు చెందిన రైతులకు సంబంధించి వ్యవసాయ భూములు సుబాష్‌నగర్, ఇస్సాపల్లి శివారులో ఎక్కువ ఉండడంతో రైతులు నిత్యం ఇదే రోడ్డు గుండా వెళ్తుంటారు. ఇటీవల కురిసిన వర్షాలకు పెద్ద గుంతలు ఏర్పడి బురదగా మారడంతో ఎప్పుడు.. ఏ వాహనం జారీపడుతుందో తెలియని పరిస్థితుల్లో వాహనదారులు ఉన్నారు. వాహనాలు వెళ్లే సమయంలో స్కిడ్ అయితే పక్కనే గల పొలాల్లో పడి గాయాల పాలు కావడం ఖాయం. అసలే అంతంత మాత్రంగా ఉన్న ఈ రోడ్డు ఇటీవల వారం రోజుల పాటు కురిసిన వర్షాలకు చిత్తడిగా మారి గుంతలు ఏర్పడ్డాయి. ఈ స్థలంలో వాహనదారులు వాహనాలు నడపడానికి జాగ్రత్త పడుతూ భయంభయంగా వెళ్లాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు.

ఏడాదిగా ప్రజలకు తప్పని తిప్పలు..

ఆలూర్ బైపాస్ రోడ్డు సమీపంలో సంవత్సరం క్రితం బ్రిడ్జి నిర్మాణం పనులు ప్రారంభమైనప్పటి నుంచి సుబాష్‌నగర్, గగ్గుపల్లి, ఇస్సాపల్లి, ఆలూర్ గ్రామాల ప్రజలకు అవస్థలు తప్పడంలేదు. ఏడాది పొడవునా సాగిన బ్రిడ్జి నిర్మాణం ఇప్పుడిప్పుడే పూర్తి కావస్తోంది. బ్రిడ్జిపై స్లాబ్ వేసి మట్టి వేసినప్పటికీ ఇటీవల కురిసిన వర్షాలకు బ్రిడ్జికి ఇరువైపులా రోడ్డుకు గుంతలు పడ్డాయి. బ్రిడ్జికి స్లాబ్ వేసిన అనంతరం ఇరువైపులా కంకర రోడ్డు వేసి తారురోడ్డు వేయాల్సి ఉంది. సుమారు అరకిలోమీటర్ వరకు తారురోడ్డు వేస్తే ఈ పరిస్థితులు వచ్చేవి కావు. ప్రజలకు ప్రయాణంలో సౌకర్యంగా ఉండేది. బ్రిడ్జి ప్రాంతంలో గతంలో లోలెవల్ వంతెన ఉండడంతో పాటు పరిసరాలు కింది భాగంలో, తక్కువ ఎత్తులో ఉండడంతో ఎగువ నుంచి కురిసిన వర్షపు నీరు పొలాల మీదుగా బ్రిడ్జిపై నుంచి ప్రవహించి రాకపోకలకు ఇబ్బందిగా ఉండేది. ప్రజల ఇబ్బందులను గమనించి గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసి వంతెన నిర్మించిన పనులు సకాలంలో పూర్తి కాలేదు. ప్రజలు పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయించి బ్రిడ్జికి ఇరువైపులా తారురోడ్డు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డుపై వెళ్లాలంటే భయంగా ఉంది..

: శ్యామ్, ఆటోడ్రైవర్, ఆలూర్



ఆలూర్ నుంచి తాము నిత్యం ఆర్మూర్ పట్టణానికి ప్యాసింజర్లను చేరవేస్తుంటాం. బైపాస్ రోడ్డు సమీపంలో బురద మయమైన రోడ్డు చూస్తే భయమేస్తుంది. ఆటో ఎప్పుడు ఏవైపుకు ఒరిగిపోతుందోనని భయం తోనే ఆటో నడిపిస్తున్నాం. నాయకులు, అధికారులు పట్టించుకొని రోడ్డును బాగు చేయాలి.

రోడ్డును బాగు చేయించాలి..

: అమోస్, ఆటోడ్రైవర్, ఆలూర్



ఆర్మూర్, ఆలూర్ మధ్య గల రోడ్డు గుంతలమయమై ఇబ్బందిగా మారింది. బురద, గుంతల రోడ్డులో ఆటోను నడపడం కష్టంగా ఉంది. ప్రయాణికులతో వెళ్ళే సమయంలో భయంగా వెళ్ళాల్సి వస్తుంది. సంబంధిత అధికారులు ఈ రోడ్డు దుస్థితి చూసి బాగు చేయించాలి.

ఈవీఎం గోదాంను సందర్శించిన కలెక్టర్

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 8: జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌లోగల ఈవీఎం గోదాంను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు గురువారం సందర్శించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈవీఎం గోదాంను పరిశీలించారు. గుర్తులు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల సమక్షంలో గోదాంను తెరిపించి సెగ్మెంట్ల వారీగా బ్యాలెట్ యూనిట్లు, ఎన్నికల సామగ్రిని భద్రపర్చిన గదులను పరిశీలించారు. కలెక్టర్‌వెంట అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, ఆర్‌డీవోలు రాజేంద్రకుమార్, రాజేశ్వర్, రాజాగౌడ్, ఎన్నికల విభాగం అధికారులు, అగ్నిమాపక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పంద్రాగస్టు వేడుకలకు ఏర్పాట్లు చేయాలి

● నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 8: స్వాతంత్ర్య దినోత్సవాలను పండుగ వాతావరణంలో నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులకు ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం అన్ని శాఖల అధికారులతో కలెక్టర్ సన్నాహక సమావేశం నిర్వహించారు. పంద్రాగస్టు సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి ఆయా శాఖల వారీగా అధికారులకు దిశానిర్దేశం చేశారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో వేడుకలు నిర్వహించనున్నందున అందుకు అనుగుణంగా వేదిక, సిట్టింగ్ ఏర్పాట్లను పక్కాగా చేసుకోవాలని వర్షాలు కురుస్తున్నందున వాటర్ ప్రూఫ్ టెంట్లు వేయించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ చికిత్స అందించేలా వైద్య బృందాన్ని, 108 అంబులెన్స్‌ను వేడుక వద్ద సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. వివిధ వర్గాల వారి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా జిల్లా ప్రగతి నివేదిక రూపొందించాలని ఆదేశించారు. వ్యవసాయ, ఉద్యానవన, జిల్లా గ్రామీణాభివృద్ధి, అటవీశాఖ, పశుసంవర్ధక, విద్య, వైద్యం, స్త్రీ శిశుసంక్షేమ, పౌరసరఫరాలు, పంచాయతీరాజ్, తదితర శాఖల పనితీరును చాటేలా శకటాల ప్రదర్శనతో పాటు స్టాల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. స్థానిక సంస్థలకు పాలకవర్గాలు లేనందున ఉదయం వేళల్లో ప్రత్యేక అధికారులు తమ తమ మండలాలు, గ్రామాల్లో జెండా ఆవిష్కరణ జరిపి జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లో నిర్వహించే వేడుకలకు సకాలంలో హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని సమగ్రవంతంగా అమలు చేసిన గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డులను సైతం ఉత్తమ జీపీలు, వార్డులుగా ఎంపిక చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, ట్రైనీ కలెక్టర్ సంకేత్, అదనపు డిసిపి కోటేశ్వర్‌రావు, నిజామాబాద్ ఆర్‌డీవో రాజేంద్రకుమార్, జడ్పీసీఈవో ఉషా, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైల్వేలైన్‌ను వ్యతిరేకిస్తూ రైతుల రాస్తారోకో



బాల్కొండ బైపాస్ వద్ద రాస్తారోకో చేస్తున్న రైతులు

ముప్కాల్, ఆగస్టు8: ఆదిలాబాద్ జిల్లా నుంచి రంగారెడ్డి జిల్లా వరకు వేసే రైల్వేలైన్ వ్యతిరేకిస్తూ గురువారం బాల్కొండ బైపాస్ వద్ద రైతులు రాస్తారోకో నిర్వహించారు. నూతన రైల్వేస్టేషన్ కోసం ఇటీవల అధికారులు సర్వే చేశారు. ఈ సర్వే లైన్‌తో బాల్కొండ, ముప్కాల్, మెండోర తదితర మండలాల రైతుల విలువైన భూములు కోల్పోతున్నామని వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వ్యవసాయమే మా జీవనాధారమని, అందుకు మేము విలువైన భూములు ఇవ్వడానికి ఒప్పుకోమని బీష్మించుకొని కూర్చున్నారు. చివరకు బాల్కొండ పోలీసులకు రైతులకు నచ్చజెప్పి ఆందోళనను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో బాల్కొండ చిట్టాపూర్, బోదేపల్లి, చేపూర్, వేంపల్లి, కొత్తపల్లి, తదితర గ్రామాల రైతులు పాల్గొన్నారు.

రైతులకు తూతూ మంత్రంగా రుణమాఫీ : కులాచారి

పెద్దబజార్,ఆగస్టు 8:ఏకకాలంలో రుణమాఫీ చేశామని ప్రభుత్వం చెబుతున్నా వాస్తవంగా రైతులందరికి రుణమాఫీ జరగలేదని దాంతో రైతులు ఆవేదన చెందుతున్నారని,65లక్షల మంది రైతులకు గాను 10లక్షలకు పైగా మంది రైతులకు మాత్రమే రుణమాఫీ జరిగిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి అన్నారు. గురువారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో జిల్లా పదాధికారుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

● భూమి అమ్మి అప్పులు కడదామంటే ధరణిలో ఎక్కలేదని వాపోయిన రైతు



రాజేష్ (ఫైల్)

జక్రాన్‌పల్లి, ఆగస్టు 8: నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలం అర్గుల్ గ్రామానికి చెందిన కుంట రాజేష్(42) అనే రైతు అప్పుల బాధతో గురువారం సాయంత్రం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై తిరుపతి తెలిపారు. అర్గుల్ గ్రామానికి చెందిన రైతు కుంట రాజేష్ ఇటుక బట్టీల తయారీతో పాటు వ్యవసాయం చేసుకుంటున్నాడని, దీంతో అప్పులు పెరిగి తన పొలంలో చెట్టుకు ఉరి వేసుకున్నాడని ఎస్సై తెలిపారు. ఇటుక బట్టీలో సుమారు రూ.12 లక్షలు అప్పులు అయ్యాయని, ఉన్న డబ్బులు లేబర్‌ల మీదనే ఉండిపోయాయని తెలిపారు. అప్పులు కడదామంటే తనకున్న రెండు ఎకరాల భూమి ధరణిలో తన పేరు మీద ఎక్కలేదన్నారు. దీంతో అప్పులు ఇచ్చిన వారు ఇంటికి వచ్చి ఇబ్బందులు పెట్టారని, అయినప్పటికీ చేసిన అప్పులకు నెలనెలా వడ్డీలు కడుతున్నానని అర్గుల్ వాట్సప్ గ్రూపులో మృతుడు రైతు రోదిస్తూ వాయిస్ రికార్డు పెట్టారని తెలిపారు. తన మాదిరిగానే ధరణిలో భూములు ఎక్కని రైతులు చాలా మంది ఉన్నారని వాటని ధరణిలో ఎక్కించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్, పోలీసులకు ఆత్మహత్యకు ముందు అర్గుల్ వాట్సప్ గ్రూప్‌లో పెట్టాడు. ప్రభుత్వం తన కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య కుంట లలిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య కుంట లలిత, ఇద్దరు కుమారులు ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో సీజనల్ వ్యాధులను అరికడదాం

● జిల్లా ఆరోగ్య విద్యాబోధకుడు ఘన్‌పూర్ వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న ఘన్‌పూర్ వెంకటేశ్వర్లు

పెద్దబజార్, ఆగస్టు 8:పరిసరాల పరిశుభ్రతతో సీజనల్ వ్యాధులను అరికడదామని జిల్లా ఆరోగ్య విద్యాబోధకులు ఘన్‌పూర్ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం నగరంలోని సీతారాంనగర్ కాలనీకి చెందిన పట్టణ ఆరోగ్య కేంద్రంలో గొల్లగుట్టలోని ప్రభుత్వ గిరిజన బాలికల డిగ్రీ కళాశాల విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ఆరోగ్యంలో భాగంగా వ్యక్తిగత ఆరోగ్యం, కుటుంబ ఆరోగ్యం, సామాజిక ఆరోగ్యం, ఆధ్యాత్మిక ఆరోగ్యం ప్రధానమైనవని అన్నారు. అదేవిధంగా సీజనల్ వ్యాధుల్లో ప్రధానంగా వర్షాకాలంలో వ్యాపించే వ్యాధులపై దృష్టిసారించాలన్నారు. కీటక, జనిత వ్యాధులను నియంత్రణలో మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా, మెదడువాపు, ఫైలేరియా ముఖ్యమైనవని అన్నారు. దోమల నియంత్రణకు ఇంటి పరిసరాలలో నీటినిల్వలను తొలగించాలని డ్రైనేజీలో పేరుకుపోయిన మురుగు, ప్లాస్టిక్, చెత్తా చెదారాన్ని తొలగించాలన్నారు. ఇంటి పరిసరాలలో వాడి పారేసిన గ్లాసులు, కప్పులు, సీసలు, బకెట్లు, పగిలిన కుండలు, పాత టైర్లు మొదలగు వాటిలో నీరు నిలువకుండా వాటిని తొలగించాలన్నారు. ఇండ్లలో వాడేటువంటి కూలర్లు, నీటితొట్టెలు, సంప్‌లు ప్రతీ శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుభ్రపరిచి ఎండబెట్టి మరుసటి రోజు నీటిని పట్టుకోవాలని అన్నారు. లేనిచో డెంగ్యూ దోమలు అందులో పెరిగి ఇండ్లలో నివసించే వారికి కుట్టడంతో డెంగీ వ్యాధి వ్యాపిస్తుందని అన్నారు. మలేరియా, చికున్‌గున్యా, మెదడువాపు, బోదకాలు ప్రబలకుండా జాగ్రత్త పడాలన్నారు. ప్రతీ ఆదివారం ఉదయం 10గంటలకు పది నిమిషాల పాటు ప్రతి ఇంటి వద్ద నీటినిల్వలను తొలిగిస్తే పరిసరాలు పరిశుభ్రత పాటించినప్పుడు దోమల నియంత్రణ జరుగుతుందని అన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రజలందరూ వైద్య సిబ్బందికి, ఆశలు, ఏఎన్‌ఎంలకు సహకరిస్తే సీజన్‌లో దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు నియంత్రించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సైదా నజీబ్, అధ్యాపకులు భార్గవి, సుశ్మిత, స్టాఫ్ నర్సులు సుశ్మిత, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

● కోమన్‌పల్లి కళాశాలలో సీజనల్ వ్యాధులపై అవగాహన

ఆర్మూర్‌రూరల్: ఆర్మూర్ మండలం కోమన్‌పల్లి గ్రామంలో సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ వర్షాకాలంలో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. తమ ఇంటి పరిసరాల్లో వర్షపు నీరు, మురికినీరు నిల్వ కుండా చూడాలని దీని వల్ల దోమలు వ్యాప్తి చెంది మలేరియా లాంటి జ్వరాలు సోకుతాయని అన్నారు. హెచ్ఎం కవిత, జీవశాస్త్ర ఉపాధ్యాయుడు పెద్ద చిన్నయ్య విద్యార్థులకు పౌష్టికాహారం, పండ్ల వినియోగం, దోమ తెరాల వాడకంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నవీన్,శ్యామల,ఉమారాణి,కారోబార్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు జాగ్రత్త వహించాలని గురువారం సీడీఎంఏ ప్రత్యేక అధికారి అన్నపూర్ణమ్మ, మున్సిపల్ కమిషనర్ రాజులు తెలిపారు. మున్సిపల్ పరిధిలోని 24వార్డులో నిల్వ ఉన్న నీటిలో దోమల లార్వలను నివారించేందుకు గంబూజీయ చేప పిల్లలను వదిలారు. అంతకు ముందు సాంఘీక సంక్షేమ మహిళ గురుకుల డిగ్రీ కళాశాలలో స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో విద్యార్థినిలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రిక, ఆకుల రాము, శాల ప్రసాద్, రింగుల భూషణ్, మున్సిపల్ మేనేజర్‌అయ్యుం, అధికారులు గజానంద్, పూర్ణమౌళి, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లిలో ఇంటింటా జ్వర సర్వే



మోర్తాడ్‌లో ఇంటింటికి వెళ్లి ఫీవర్ సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో

కమ్మర్‌పల్లి,ఆగస్టు 6:సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా గురువారం కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో ఇంటింటా జ్వరసర్వే కార్యక్రమాన్ని నిర్వహించారు, వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఈకార్యక్రమంలో ప్రతీఇంటికి వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుంటూ నమోదు కార్యక్రమం చేపట్టారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని,వర్షపు నీరు నిలువకుండా చూసుకోవాలని దోమలవ్యాప్తికి కారణమయ్యే తాగి పడేసిన కొబ్బరి బొండాలు, టైర్లు, కుండీల్లో నీళ్ల నిలవుండకుండా చూసుకోవాలని తగుసూచనలు చేశారు. జ్వరంవచ్చినట్లు తదితర ఇబ్బందులు ఎదురైతే వెంటను ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాలని సూచించారు గ్రామంలో గురువారం ఆరుటీంలు జ్వరసర్వే నిర్వహించినట్లు గ్రామ పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఆశావర్కర్‌లు, వీవోఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

● ఫీవర్ సర్వే సరళిని పరిశీలించిన అధికారులు

మోర్తాడ్: మండల కేంద్రంలో ఫీవర్ సర్వే సరళిని గురువారం ఎంపీడీవో తిరుమల పరిశీలించారు. మండల కేంద్రంలో ఆశావర్కర్‌లు ఇంటింటికి తిరుగుతూ ఫీవర్ సర్వేను నిర్వహిస్తున్నారు. సర్వే జరుపుతున్న సరళిని అధికారులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీకార్యదర్శి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నవీపేటలో గంజాయి పట్టివేత

సుభాష్‌నగర్/నవీపేట,ఆగస్టు 8:గంజాయి అమ్ముతున్నారన్న సమాచారంతో నవీపేట మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్ ప్రాంతంలో తనిఖీలు నిర్వహించారు. గంజాయి అమ్ముతున్న ఒకరిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 500 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వెంకటేశ్ తెలిపారు. ఉదయం సయ్యద్ రఫీక్ అనే వ్యక్తి అనుమానాస్పదంగా రైల్వేస్టేషన్ ప్రాంతంలో గంజాయి అమ్ముతుండగా రెడ్‌హాండెడ్‌గా పట్టుకొని 500 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.ఈసందర్భంగా ఎక్సైజ్ సీఐ వెంకటేశ్ మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ ఎవరైనా అమ్మిన, కలిగి ఉన్న, సేవించిన చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గంజాయి గురించి ఎవరైనా సమాచారం తెలిస్తే ఎక్సైజ్ అధికారులకు సమాచారం ఇవ్వాలని వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ దాడుల్లో వెంకటేశ్, నర్సింహాచారి, భూమన్న, భోజన్న, అవి నాష్, ఉత్తమ్, విష్ణు, రాంబచ్చన్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.



నిందితుడిని పట్టుకున్న ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

న్యాయవాదుల విధుల బహిష్కరణ

నిజామాబాద్ లీగల్, ఆగస్టు 8: న్యాయవాదులపై జనగామ జిల్లాలో పోలీసుల భౌతిక దాడిని నిరసిస్తూ గురువారం నిజామాబాద్ జిల్లా కోర్టు చౌరస్తాలో న్యాయవాదులు నిరసన వ్యక్తం చేశారు. నల్ల బ్యాడ్జీలను ధరించి విధులను బహిష్కరించారు. బార్ అసోసియేషన్ అత్యవసర సమావేశం ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు అధ్యక్షుడు జగన్ మోహన్ గౌడ్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదులు కక్షిదారుల ప్రయోజనాలే పరమావాదిగా తమ వృత్తి ధర్మాన్ని నిర్వహిస్తారన్నారు. వ్యక్తిగత పనికోసం కాకుండా చట్టబద్ధమైన పనికోసం వెళ్లినవారిని జనగామ పోలీసులు న్యాయవాదులపై జరిపిన భౌతికదాడిని తీవ్రంగా ఖండిచాలన్నారు. అనంతరం రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు మంథాని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బార్ అసోసియేషన్ అన్ని గురు, శుక్రవారం రెండు రోజుల పాటు తమ విధులను బహిష్కరించి బాధ్యులైన పోలీసులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వసంత్‌రావు, ధన్‌పాల్ సురేష్, కోశాధికారి దీపక్, న్యాయవాదులు రెంజర్ల సురేష్, విఘ్నేష్, రవి, విశ్వక్ సేన్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

● రెండో రోజు న్యాయవాదులు విధుల బహిష్కరణ

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం న్యాయవాదులు రెండవ రోజు విధులను బహిష్కరించారు. ఇటీవల జనగామా జిల్లా కేంద్రంలో న్యాయవాద దంపతులను అమృత్‌రావు, కవితలపై దాడికి పాల్పడిన సీఐ రఘుపతిరెడ్డిని విధుల నుంచి తొలగించాలని వారు కోరారు. న్యాయవాదులకు రక్షణ చట్టం తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తెడ్డు నర్సయ్య, ఉపాధ్యక్షుడు శంకర్, న్యాయవాదులు అరుణ, తుమ్మ సుకేష్, సురేష్, నరేం ధర్, శ్రీధర్, కృష్ణంరాజు, కీర్తిసాగర్, దాస్‌బాబు, జీజీ.రాం, నరేష్, బాబాగౌడ్, కార్తిక్, సంజీవ్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

కాలువలో పడి ఒకరి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఖిల్లా, ఆగస్టు 8: కాలువలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మూడో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. దుబ్బాక గ్రామానికి చెందిన వడ్ల రమేష్ (53) నగరంలోని గౌడ్స్ కాలనీ వద్ద లారీ మెకానిక్ షెడ్డు వేసుకొని జీవనం సాగిస్తున్నాడని తెలిపారు. సోమవారం దుబ్బాక నుంచి నగరానికి వచ్చిన మృతుడు కాలువలో పడి మృతి చెందినట్లు స్థానికుల ద్వారా తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడికి మద్యం తాగే అలవాటు ఉందని, భార్య మేఘమాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు.

2వ వార్డులో తల్లిపాల వారోత్సవాలు

ఆర్మూర్‌టౌన్,ఆగస్టు8: పట్టణంలోని 2వ వార్డులో అంగన్‌వాడి కేంద్రంలో గురువారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సంద ర్భంగా స్థానిక కౌన్సిలర్ ఖాందేశ్ సంగీత మాట్లాడుతూ తల్లిపాల అవ శ్యకత గురించి తల్లులకు వివరించారు. పిల్లలకు అనారోగ్య సమస్యలు రాకుండా ముర్రుపాలు తప్పకుండా ఇవ్వాలని తెలిపారు. గర్భిణులు పాటించాల్సిన ఆరోగ్య సూత్రలను వివరించారు. ఈకార్యక్రమంలో మున్సి పల్ అధికారులు షకీల్, చక్రధర్, కాంగ్రెస్ నాయకులు ఖాందేశ్ సత్యం, నాగలత, సరిత, మమత, జారీన, కవిత, మాధురి, శ్రీలత, గంగ భవాని, నవనీత, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

● బోధన్ తహసీల్దార్ విఠల్

బోధన్ రూరల్, ఆగస్టు 8 : అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని బోధన్ తహసీల్దార్ విఠల్, రూరల్ ఎస్ఐ నాగ్‌నాథ్ అన్నారు. గురువారం అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు వారు తెలిపారు. మంజీర సరిహద్దు గ్రామాల నుంచి అక్రమ ఇసుక రవాణా జరుగుతుందన్న పక్కా సమాచారం మేరకు దాడులు నిర్వహించి ట్రాకర్టర్లను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. ఇక నుంచి ఎవరైనా ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వీరి వెంట సాలూర తహసీల్దార్‌తో పాటు రెవెన్యూ, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

తహసీల్దార్‌పై ఆర్డీవోకు ఫిర్యాదు

నవీపేట,ఆగస్టు8: నవీపేట తహసీల్దార్ నారాయణపై మండలంలోని యంచకు చెందిన పలువురు గ్రామస్థులు గురువారం నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామ శివారులో 1994-95 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం రాజీవ్ గాంధీ తాగునీటి పథకం ఏర్పాటుకు భూమిని సేకరించిందని, దీనికి సంబంధించిన భూమిలో 5గుంటల భూమిని ఇటీవల మాజీ సర్పంచ్ పేరున తహసీల్దార్ పట్టా మార్పిడి చేశారని వారు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంపై విచారణ జరపాలని వారు ఆర్డీవోను కోరారు. ఈ విషయంపై తహసీల్దార్ నారాయణను వివరణ కోరగా రికార్డులకు అనుగుణంగా పట్టా మార్పిడి చేయడం జరిగిందని, ఎటువంటి అక్రమాలు జరగలేదని అన్నారు.

విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి

ఆర్మూర్‌రూరల్, ఆగస్టు8: కళాశాలల్లో సీనియర్ విద్యార్థులు ర్యాగింగ్ పేరిట జూనియర్ విద్యార్థులను వేధించి ఇబ్బందులు పడవద్దని భీమ్‌గల్ ఎస్సై హరిబాబు అన్నారు. గురువారం భీమ్‌గల్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు యాంటి ర్యాగింగ్‌పై అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జైపాల్‌రెడ్డి, అధ్యాపకులు కృష్ణదాస్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోతంగల్‌లో ఇసుక వేలంపాట

కోటగిరి,ఆగస్టు8: పోతంగల్ తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఇసుక వేలంపాట నిర్వహించారు. కొడిచర్ల గ్రామంలో నాలుగు ట్రాక్టర్ల ఇసుక డంప్‌ను సీజ్ చేసి వేలంపాట నిర్వహించగా ముగ్గురు వేలంపాటలో పాల్గొన్నారు. కొడిచర్ల గ్రామానికి చెందిన నాగరాజు గౌడ్ అనే వ్యక్తి రూ.2700లకు ఇసుకను దక్కించుకున్నట్లు ఆర్ఐ తెలిపారు.

రాజన్నను దర్శించుకున్న కామారెడ్డి ఎమ్మెల్యే



కోడెమొక్కు చెల్లించుకుంటున్న ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి

వేములవాడ కల్చరల్,ఆగస్టు 8: రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారిని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి దర్శించుకున్నారు.రాజన్న ఆలయానికి విచ్చేసిన ఆయనకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకరమణారెడ్డి కుటుంబసభ్యులు రాజన్న ఆలయంలో ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అనంతరం అర్చకులు ఆశీర్వదించగా ఆలయ సూపరింటెండెంట్ తిరుపతి రావు ప్రసాదాన్ని అందజేశారు.

ఉప్లూర్‌లో బాధిత కుంటుబాలకు పరామర్శ

కమ్మర్‌పల్లి,ఆగస్టు 6:మండలంలోని ఉప్లూర్ గ్రామంలో ఇటీవల వివిధ కారణాలతో మరణించినవారి కుటుంబాలను జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి గురువారం పరామర్శించారు.ఆయనవెంట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకెట రవి, తిప్పిరెడ్డి శ్రీనివాస్, చింతకుంట శ్రీనివాస్, మాజీ సర్పంచ్ బద్దం రమేష్‌రెడ్డి, కొమ్ముల రవిందర్, జిల్లా నాయకులు బోనగిరి భాస్కర్, దేవేందర్, బుచ్చిమల్లయ్య, తిరుపతిరెడ్డి, జిల్లా మైనారిటీ నాయకుడు అబ్దుల్ రఫీ, ప్రదీప్, తదితర కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

నందిపేట టూ నిజామాబాద్‌కు ఎక్స్‌ప్రెస్ బస్‌లు

నందిపేట, ఆగస్టు 8: నందిపేట నుంచి నిజామాబాద్ వరకు రెండు ఎక్స్‌ప్రెస్ బస్‌లను ఆర్టీసీ అధికారులు వేశారు. వాటిని గురువారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంద మహిపాల్ ప్రారంభించారు. నందిపేట ప్రయాణీకుల సౌకర్యార్థం రెండు ఎక్స్‌ప్రెస్ సర్వీస్‌లను వేయాలని ఇటీవల ఆర్మూర్ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ప్రొద్దుటూరి వినయ్‌రెడ్డి ఆధ్వర్యంలో నందిపేట కాంగ్రెస్ నాయకులు నిజామాబాద్ ఆర్ఎం జాన్‌రెడ్డిని కలిశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంద మహిపాల్, మండల మైనార్టీ అధ్యక్షులు యూసుఫ్, నాయకులు ఎడ్లిగారి నిఖిల్, మేర ప్రవీణ్, శ్రీను, ఆర్టీసీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

బంగ్లాదేశ్ జాతీయ జెండా దహనం

పెర్కిట్, ఆగస్టు8: బంగ్లాదేశ్ హిందువులపై జరుగుతున్న అరాచాకాలకు నిరసనగా గురువారం ఆర్మూర్ పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తా వద్ద బీజేపీ నాయకులు బంగ్లాదేశ్ జాతీయ జెండాను దహనం చేశారు. బంగ్లాదేశ్ రిజర్వేషన్ల కోసం జరుగుతున్న ఉద్యమంలో హిందు దేవాలయాలను, హిందువుల ఇళ్లను లూటీ చేయడం ఆందోళకరమైన విషయమని అన్నారు. ఇకనైనా బంగ్లాదేశ్‌లో హిందువులపై అరాచాకాలను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి ఆర్మూర్, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ జీవీ.నర్సింహరెడ్డి, ఆర్మూర్ పట్టణశాఖ అధ్యక్షుడు ద్యాగ ఉదయ్, జిల్లా అధికార ప్రతినిధి కలిగోట గంగాధర్, సీనియర్‌నాయకుడు ఆకుల శ్రీనివాస్, జెస్సు అనిల్, బీజేపీ జిల్లా బీసీ మోర్చా యామాద్రి భాస్కర్, మందుల బాలు, తదితరులు పాల్గొన్నారు.

సిరికొండలో సుదర్శన్‌రెడ్డి జన్మదిన వేడుకలు

సిరికొండ ఆగస్టు 2: బోధన్ ఎమ్మెల్యే మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా సిరికొండలో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. తెలంగాణ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి ప్రజలకు, కార్యకర్తలకు స్వీట్లను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవి, జిల్లా నాయకులు ఎర్రన్న, బాకారం సంతోష్, దేగం సాయన్న,కుందేళ్ల శ్రీనివాస్, రమేష్ జీవన్, రాంరెడ్డి,మల్లేష్, సంతోష్ నాయక్,బాస్కర్‌రెడ్డి, ప్రణీత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్‌లో నాగదేవతకు బోనాలు

మోర్తాడ్, ఆగస్టు8: మండల కేంద్రంలోని గోవింద్‌రెడ్డి కాలనీలో నాగదేవత ఆలయ వార్షికోత్సవం సందర్భంగా బోనాలతో భారీ ఎత్తున మహిళలు బోనాలతో పూజలు నిర్వహించారు. తొలుత కాలనీకి చెందిన మహిళలు అధిక సంఖ్యలో మంగళహారతులు, గంగజలాలతో, బోనాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.అనంతరం గంగాజలాలతో ఎల్లమ్మ ఆలయం జలాభిషేకం చేశారు. నాగదేవత ఆలయంలో జలాభిషేకం చేసి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలని ధర్నా

ముప్కాల్, ఆగస్టు8: బాల్కొండ మండల కేంద్రంలోని డబుల్‌బెడ్‌రూం ఇళ్లకాలనీలో మౌలిక వసతులు కల్పించాలని గురువారం కాలనీవాసులు గ్రామ పంచాయతీ ఎదుట ధర్నా నిర్వహించారు. కాలనీలో తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ, వర్షపునీరు నిల్వ ఉండి కాలనీలో గుంతలు ఏర్పడి దోమలు వృద్ధి చెందుతున్నాయని, దీంతో అంటు వ్యాధులు ప్రబలుతున్నాయని వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డబుల్‌బెడ్‌రూం ఇళ్ల కాలనీవాసులు పాల్గొన్నారు.

పీజీ 2వ సెమిస్టర్ ఇంటిగ్రేటేడ్ , 8వ సెమిస్టర్ రెగ్యులర్ బ్యాక్‌లాగ్ పరీక్షల టైం టేబుల్ విడుదల

డిచ్‌పల్లి,ఆగస్టు 8: తెలంగాణ యూనివర్సిటీ పీజీ ఎంఏ, ఎంకాం, ఎంఎస్ డబ్ల్యూ, ఎంఎస్సీ, ఎంబీఏ,ఎంసీఏ, 2వ సెమిస్టర్, 5ఏళ్ల ఇంటిగ్రెటెడ్ కోర్సుల ఏపీఈ, ఐఎంబీఏ, ఐపీసీహెచ్, 8వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లగ్, బీఎల్ ఐఎస్సీ బ్యాక్‌లాగ్ పరీక్షల టైం టేబుల్ గురువారం విడుదల చేసినట్లు సీవోఈ ప్రొ.అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 27నుంచి సెప్టెంబరు 6 వరకు జరుగుతాయని పూర్తి వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్ సైట్ సంప్రదించాలని సూచించారు.

వర్షానికి కూలిపోయిన ఇంటి పై కప్పు



కూలిపోయిన ఇంటిపై కప్పు

సిరికొండ ఆగస్టు 2: సిరికొండ మండలంలోని గడ్డమీది తండాలో శుక్రవారం ఉదయం ఇల్లు కూలిపోయింది. గత వారం పది రోజులుగా కురుస్తున్న ముసురు వానకు ఇల్లు తడిసి పోయి కూలి పోయింది. ఇల్లు కూలిన సమయంలో ఇంటిలో ఎవరు లేక పోవడం వల్ల ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదని తండాకు చెందిన లక్ష్మన్ తెలిపారు. మళ్లీ వర్షం కురుస్తే ఇబ్బంది అవుతుందిన కుటుంబం సభ్యులు ఇంటిని ఖాలి చేసి ఇతరుల ఇంటిలో నివాసముంటున్నారు. ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని యజమాని బట్టు లాలు విజ్ఞప్తి చేశారు.

నవీపేట సంతలో గుంతల పూడ్చివేత

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



నవీపేట సంతలో మొరంతో గుంతలను చదును చేయిస్తున్న దృశ్యం

నవీపేట,ఆగస్టు8: నవీపేట గ్రామ పంచాయతీ పరిధిలోని వారంతపు సంతలో ఏర్పడిన గుంతలను గురువారం అధికారులు మొరంతో పూడ్చివేసి చదును చేయించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సంత పూర్తిగా బురదమయంగా మారడంతో గత నెల 27న ఆంధ్రజ్యోతిలో "చిత్తడిగా మారిన సంత" అనే వార్తకు అధికారులు స్పందించారు. సంతలో ప్రతి శుక్రవారం వారంతపు సంత, శనివారం మేకల సంత నిర్వహిస్తుండడంతో సంత పూర్తిగా బురదమయంగా మారడంతో అమ్మకందారులు, కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సంతలో ఉన్న బురదను తొలగించి మొరంతో గుంతలను పూడ్చివేసి చదును చేయించడానికి కృషి చేసిన ఆంధ్రజ్యోతికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

డల్లాస్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన నగరవాసి


సీఎంను కలిసిన శశ్రుత్ పాటిల్

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 8:అమెరికా పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డిని డల్లాస్‌లో నగరానికి చెందిన యువకుడు శశ్రుత్ పాటిల్ మర్యాద పూర్వకంగా కలిశారు. శశ్రుత్ పాటిల్ ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ ద్వారా ఇండియా నుంచి అమెరికా వెళ్లే విద్యార్థులకు సహాయ సహకారాలు అందిస్తున్నాడు. ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ యూత్ కమిటీ ఉపాధ్యక్షుడిగా ఉన్నాడు. గత నాలుగు రోజులుగా అమెరికా పర్యటనలో ఉన్న సీఎం గురువారం డల్లాస్‌లోని ఐటీ కంపెనీ కార్యక్రమంలో పాల్గొనగా మంత్రి శ్రీధర్‌బాబు శశ్రుత్ పాటిల్‌ను సీఎంకు పరిచయం చేశారు. శశ్రుత్ పాటిల్ నగరానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, రాష్ట్ర ఓబీసీ సెల్ వైస్‌చైర్మన్ కొడప శరత్‌కుమారుడు తదితరులు పాల్గొన్నారు.

రవి పబ్లిక్ స్కూల్‌లో జాతీయస్థాయి ఖేలో ఇండియా టాలెంట్ నిర్ధారణ పోటీలు


సెలక్షన్స్‌లో పాల్గొన్న విద్యార్థులు

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 8:కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కేంద్ర యువజన క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో భారత్ క్రీడా ప్రాధికార సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ఖేలో రైజింగ్ టాలెంట్ ఐడెంటిఫికేషన్ కార్యక్రమం గురువారం నగరంలోని సుభాష్‌నగర్‌లోగల రవి పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ క్రీడా అంశాలలో విద్యార్థులు పాల్గొనగా కోచ్‌లు క్రీడాకారులను ఎంపిక చేశారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా బృందం విద్యార్థుల ఎంపికను నిర్వహించింది. ఈ ఎంపికలో కబడ్డీ కోచ్ శ్రీనివాస్‌రావు, అథ్లెటిక్స్ కోచ్ సుబ్బారావు పాల్గొన్నారు. సుమారు 300 మంది విద్యార్థులకు ఫిజికల్ ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించినట్లు పాఠశాల కరస్పాండెంట్ సరళ మహేందర్‌రెడ్డి తెలిపారు. రాబోయే రోజుల్లో ఒలంపిక్స్‌లో భారతదేశం పతకాలు సాధించేలా ఇప్పటి నుంచే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సెక్రెటరీ శ్యామ్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతీ బీజేపీ కార్యకర్త ఇంటిపై జెండా ఎగురవేయాలి


మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

పెద్దబజార్, ఆగస్టు 8: ఈనెల 13 నుంచి 15 వరకు హర్ ఘర్ తిరంగ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రతి బిజెపి కార్యకర్త తన ఇంటిపై జాతీయ జెండా ఎగరవేసి సెల్ఫీ తీసుకొని సోషల్ మీడియాలో పోస్ట్ చేయాలని ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. గురువారం నగరంలోని బిజెపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పేదలు సంపన్నులు చిన్న ఇల్లు పెద్ద భవనం అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరు తమ ఇంటిపై ఆత్మగౌరవంతో త్రివర్ణ పతకాన్ని ఎగరవేయాలని అన్నారు. ఈనెల 10, 11 తేదీలలో గ్రామాలు, మండల కేంద్రాల్లో స్వతంత్ర సమరయోధుల విగ్రహాలకు స్మారక చిహ్నాల చుట్టూ పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించి విగ్రహాల వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి పుష్పాంజలి ఘటించాలని పిలుపునిచ్చారు. 11 నుంచి 13 వరకు ప్రతి మండలం, మున్సిపాలిటీ, అసెంబ్లీ స్థాయిలో యువమోర్చ ఆధ్వర్యంలో తిరంగ్ యాత్ర నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, రాజు, తిరుపతిరెడ్డి, సుధాకర్‌చారి, బద్దం కిషన్, శివప్రసాద్, రాజేశ్వర్, కలిగోట్ గంగాధర్, పల్నాటి కార్తిక్, తదితరులు పాల్గొన్నారు.

● ఫుట్‌బాల్ క్రీడలను ప్రారంభించిన ఎమ్మెల్యే ధన్‌పాల్

సుభాష్‌నగర్: ఇందూరు ఫుట్‌బాల్ అకాడమి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫుట్‌బాల్ క్రీడాపోటీలను అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త ప్రారంభించారు. నగరంలోని పాలిటెక్నిక్ మైదానంలో ఫుట్‌బాల్ పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 35వ డివిజన్ కార్పొరేటర్ ఎర్రం సుధీర్, ఫుట్‌బాల్ అకాడమి సభ్యులు సంజయ్, ఆనంద్, పవన్ ముండాడ, తదితరులు పాల్గొన్నారు.

పీజీ ఇంటిగ్రేటెడ్ పరీక్షల్లో 24 మంది విద్యార్థులు గైర్హాజర్

డిచ్‌పల్లి,ఆగస్టు 8: పీజీ ఇంటిగ్రెటెడ్ పరీక్షల్లో గురువారం 24మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొ.చంద్రశేఖర్ తెలిపారు. ఎంఎస్‌డబ్ల్యూ,ఎంకాం, ఎంఎస్సీ, ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం 5ఏళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సు ఏపీఈ, ఐపీసీహెచ్ 1,3,4,7,9 సెమిస్టర్ బ్యాక్‌లగ్ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు తెలిపారు. ఉదయం జరిగిన పరీక్షకు 153 మంది కి గాను 129 హాజరయ్యారని 24 గైర్హాజరయ్యారని ఆయన పేర్కొన్నారు. ఆడిట్ సెల్ డైరెక్టర్ పేర్కొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

● మాజీ జడ్పీచైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు


మాదాపూర్‌లో మొక్కను నాటుతున్న జడ్పీ మాజీచైర్మన్


పచ్చలనడ్కుడలో మొక్క నాటుతున్న రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్


పరిసరాలను పరిశీలిస్తున్న సీడీఎంఏ జిల్లా అధికారిణి

మాక్లూర్, ఆగస్టు8: సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవాలని జడ్పీమాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని మాదాపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల్లో శ్రమదానం చేసి మురికికాలువలను శుభ్రం చేయడంతో పాటు మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ముత్తెన్న, ఎంపీడీవో క్రాంతితో పాటు పంచాయతీ అధికారులు, అంగన్‌వాడి, ఆశవర్కర్‌లు పాల్గొన్నారు.

సుభాష్‌నగర్: నగరంలోని పలు డివిజన్‌లలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమం గురువారం నిర్వహించారు. నగరంలోని పలు డివిజన్‌లలో స్వచ్ఛదనం పచ్చదనంపై ప్రజలకు అవగాహన కల్పించారు. నగర పాలక సంస్థ అడిషనల్ కమీషనర్ శంకర్ ఆధ్వర్యంలో పలు వార్డుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా అడిషనల్ కమీషనర్ శంకర్ మాట్లాడుతూ మురికి కాలువలు శుభ్రంగా ఉంచుకోవాలని చెత్తను మోరీలో వేయకుండా చూసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో 46వ డివిజన్ కార్పొరేటర్ అక్బర్ హుస్సేన్, ఎంఈ మురళిమోహన్, ఆర్‌వో, ఎస్సై,ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

నందిపేట:మండల కేంద్రంలో గురువారం లయన్స్ క్లబ్ ఆఫ్ నందిపేట ఆధ్వర్యంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా నందిపేటలోని మోడల్ స్కూల్ తదితర పలు ప్రాంతాల్లో సుమారు 100 మొక్కలను నాటారు. వాటిని సంరక్షించేందుకు లయన్స్ క్లబ్ సభ్యులు బాధ్యత తీసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాల్లో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని నందిపేట లయన్స్ క్లబ్ పిలుపునిచ్చింది. ఈకార్యక్రమంలో అధ్యక్షుడు శౌరిబాబు, కోశాధికారి నర్సయ్య, సభ్యులు బద్దం సాయరెడ్డి, పెద్దోల్ల దేవన్న, గంగుల జనార్దన్, ఉత్తూర్ సురేష్, మంద మహిపాల్, రాజన్న,మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఫిరోజ్ ఉన్నారు.

వేల్పూర్:రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో ప్రతీఒక్కరు భాగస్వాములు కావాలని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి అన్నారు.గురువారం వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడ గ్రామంలో నిర్వహించిన స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడం కోసం ముందుకు వెళ్తుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటిని ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ వస్తుందన్నారు. అంతకు ముందు పచ్చలనడ్కుడ గ్రామంలోని మహిళ సంఘ భవన ఆవరణలో అన్వేష్‌రెడ్డి మొక్కలను నాటారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో బాలకృష్ణ, ఏపీవో అశోక్, ఎంపీవో సాయిలు, ఐకెపీ సీసీ వరలక్ష్మీ, టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాస్, సుకేష్, స్వరూప, మహిళ సంఘాల వివోలు, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

● మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించిన అన్వేష్‌రెడ్డి

మండలంలోని అంక్సాపూర్ గ్రామంలోని చరణ్ వాళ్ళ నాన్న ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి గురువారం అంక్సాపూర్ గ్రామంలోని చరణ్ ఇంటికి వెళ్లి వారి కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. .

వేల్పూర్: మండలంలోని కుకునూర్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం హరిచరణ్ ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో కనుగ, ఉసిరి, జమ, నిమ్మ చెట్లను నాటారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పఠాని గంగాధర్, శ్రీధర్‌రావు, మల్కన్న, నాగరాజు, రవీందర్, చరణ్‌దాస్, ఆరోగ్య సిబ్బంది, ఫీల్డ్‌అసిస్టెంట్ అంగన్‌వాడి టీచర్‌లు గ్రామకార్యదర్శి, ఆశవర్కర్‌లు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

మోపాల్: స్వచ్ఛదనం -పచ్చదనం కార్యక్రమంలో భాగంగా గురువారం మోపాల్ మండల కేంద్రంలో ఎంపీడీవో రాములు ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయం సమీపంలో మొలిచిన పిచ్చిమొక్కలను తొలగించారు. అదేవిధంగా గ్రామాల్లోని ప్రధాన వీధులను సందర్శించి పిచ్చిమొక్కలు తొలగించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు,అధికారులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: మండల గ్రామాల్లో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో పాల్గొనలని ప్రత్యేకాధికారి శ్రీనివాస్‌గౌడ్ నడిపల్లి ఈవో కిషన్‌రావు అన్నారు.గురువారం మండలంలోని నడిపల్లి,గాంధీనగర్, స్టేషన్ ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్‌తో పాటు మురుగు కాలువతోపాటు డిచ్‌పల్లి బస్టాండ్ ప్రాంతంలో గడ్డి మందు పంచాయతీ సిబ్బంది పిచికారి చేశారు.ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు రాజకీయ పార్టీలకు అతీతంగా పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది రజత్ కుమార్, శాంసన్, రాము, సంతోశ్, బాబా, పాల్గొన్నారు.

మోస్రా: స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మోస్రా గ్రామ పంచాయతీ ఆవరణలో గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి ఎడ్డేడి సాయిలు ఆధ్వర్యంలో మొక్కలు నాటడం జరిగింది. అదే విధంగా ప్రతి ఇంటికి ఆరు మొక్కలు పంపిణీ చేసి ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి, వాటిని కాపాడాలని ప్రత్యేక అధికారి సాయిలు అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రేమ్‌కుమార్, ఆశావర్కర్‌లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఐకెపీ వీవోఏలు, కారోబార్లు,కంప్యూటర్ ఆపరేటర్ , బిల్ కలెక్టర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్:మున్సిపల్ పరిధిలోని 24వార్డు మామిడిపల్లిలో స్థానిక కౌన్సిలర్ ఆకుల రాము ఆధ్వర్యంలో గురువారం స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కాలనీలోని నీటిగుంతలలో నిజాంసాగర్‌కెనాల్‌లో ఆయిల్‌బాల్స్ వేశారు. దోమల వృద్ధి చెందకుండా లార్వ నివారణకై మలాతియన్ స్ప్రేచేయడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు ప్రత్యేక అధికారి చలం, సానిటరీ ఇన్‌స్పెక్టార్ గజానంద్, మున్సిపల్ సిబ్బంది ఆశవర్కర్‌లు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టి అమలు జరుపుతున్న స్వచ్ఛదనం -పచ్చదనం కార్యక్రమాన్ని నాగాపూర్ గ్రామంలో గురువారం మండల ఎంపీడీవో రాజా శ్రీనివాస్ సందర్శించి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి కాందేష్ సంధ్య, అంగన్‌వాడి టీచర్లు, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం.. పచ్చదనంపై ప్రతీ ఒక్కరు ప్రత్యేక దృష్టి సారించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీడీఎంఏ జిల్లా అధికారిణి అన్నారు. గురువారం బోధన్ పట్టణంలోని పలు వార్డుల్లో ఆమె సందర్శించారు. డ్రైనేజీ పరిశుభ్రత పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ప్రతీ ఒక్కరు తమ ఇళ్లలలో, ప్రభుత్వ స్థలాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించుకోవాలన్నారు.సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ఆమె వెంట బోధన్ మున్సిపల్ కమిషనర్ వెంకట రమణ, ఏఈ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

'బుద్ధదేవ్ ఆశయాలను కొనసాగించాలి'

బోధన్‌రూరల్,ఆగస్టు8: కమ్యూనిటీ పార్టీ ఉద్యమ నిర్మాత పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి కామ్రేడ్ బుద్ధదేవ్ భట్టచార్య కలకత్తాలోని ప్రైవేటు ఆసుపత్రిలో గురువారం మృతి చెందడం పట్ల బోధన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా సీపీఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు శంకర్ గౌడ్ మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్ సీపీఎం పార్టీ ఉద్యమ పద్దతిలో కామ్రేడ్ బుద్ధదేవ్ భట్టచార్య చాలా కీలకంగా వ్యవహరించారన్నారు. ఆయన జీవితాన్ని ప్రజల కోసం,కార్మిక వర్గం కోసం త్యాగం చేశారని ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈకార్యక్రమంలో సీపీఎం పార్టీ సీనియర్ నాయకులు గంగాధరప్ప, నాయకులు తదితరులున్నారు.

పెద్దబజార్: పశ్చిమబెంగాళ్ మాజీ సీఎం బుద్దాదేవ్ బట్టాచార్య మృతి వామపక్షాలకు తీరనిలోటని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. గురువారం నగరంలోని సిపిఐ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుద్దాదేవ్ బట్టాచార్య సుమారు 11సంవత్సరాలు పశ్చిమబెంగాళ్ ముఖ్యమంత్రిగా సేవలు చేశారని ఆయన జీవితమంతా త్యాగాలు చేశారనిఅన్నారు.ఈకార్యక్రమం లో సిపిఐ నాయకులు ఓమయ్య, రాజయ్య, రంజిత్, నర్సింగ్ పాల్గొన్నారు.

● బుద్దదేవ్ బట్టాచార్య ప్రధానపాత్ర పోషించారు

దేశంలో ఎక్కడలేని విధంగా పశ్చిమ బెంగాళ్‌లో 12.5లక్షల ఎకరాలు పంచి నిరుపేదలను, రైతులను చేసిన ఘనత పశ్చిమ బెంగాళ్ సిపిఎం పార్టీ ప్రభుత్వానికే దక్కిందని అందులో బుద్దదేవ్ బట్టాచార్య ప్రధానపాత్ర పోషించారని సిపిఎం జిల్లా నాయకుడు పెద్దివెంకట్రాములు అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నూర్జహాన్, కటారి రాములు, సాయాగౌడ్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని శాస్త్రీనగర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో గురువారం పశ్చిమబెంగాల్ మాజీ సీఎం బుద్ధదేశ్ భట్టాచార్య ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి రెండు నిమిషాలు మౌనం పాటించారు.ఈ కార్యక్రమంలో సీపీఎం డివిజన్ కార్యదర్శి పల్లెపు వెంకటేష్, పట్టణ కార్యదర్శి కుతాడి ఎల్లయ్య, డి.రవి, లాల్యానాయక్, తదితరులు పాల్గొన్నారు.


నివాళులు అర్పిస్తున్న దృశ్యం

రుణమాఫీ కాలేదని రూరల్ ఎమ్మెల్యేకు ఫిర్యాదు

●ఎమ్మెల్యేను కలిసిన గుండారం రైతులు ● 68 మంది రైతుల వివరాలు లేవు


ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న గుండారం రైతులు

నిజామాబాద్ రూరల్, ఆగష్టు, 8: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రుణమాఫీ కార్యక్రమం పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం రూరల్ మండలం గుండారం గ్రామానికి చెందిన రైతులు ఎమ్మెల్యే భూపతిరెడ్డిని కలిశారు. గుండారం సొసైటీ పరిధిలోని 68 మంది రైతులకు రుణమాఫీ జరగలేదన్నారు. సొసైటీ అధికారులు రైతుల వివరాలు నమోదు చేయడంలో జాప్యం చేశారని, దాంతో బ్యాంక్ సిబ్బంది కూడా సరియైన వివరాలు నమోదు చేయకపోవడంతో రైతులు నష్టపోయారని వివరించారు. ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి రైతులకు న్యాయం చేస్తానని ఎమ్మెల్యే భూపతిరెడ్డి రైతులకు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసినవారిలో గుండారం మాజీ సర్పంచ్ దాసరి చిన్న ఒడ్డెన్న, సొసైటీ చైర్మన్ దాసరి శ్రీధర్, రైతులు దాసరి రమణబాబు, ఆకుల గంగాధర్, శివగారి రామన్న,జీవన్‌రెడ్డి తదితరులున్నారు.

ధర్పల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి కాంగ్రెస్ పార్టీలోకి భారీగా చేరుతున్నట్లు నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. గురువారం ధర్పల్లి సింగిల్‌విండో చైర్మన్ మల్లికార్జున్, వైస్‌చైర్మన్, డైరెక్టర్లు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలోకి వివిధ పార్టీల నుంచి భారీగా నాయకులు, కార్యకర్తలు వస్తున్నట్లు ఆయన చెప్పారు. రాష్ట్రంలోని రైతులు రుణమాఫీతో రైతు కుటుంబాల్లో సంతోషం వెల్లివిరుస్తున్నట్లు ఆయన చెప్పారు. తమ ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆర్మూర్ చిన్నబాల్‌రాజ్, అధికార ప్రతినిధి చెలిమెల నర్సయ్య, గాదారి మనోహర్‌రెడ్డి, మిట్టపల్లి గంగారెడ్డి, లొక్కిడి రాములు, సురేందర్ గౌడ్, బేల్దారి కృష్ణ, పుప్పల సుభాష్, గంగాధర్, బాలు, తదితరులు పాల్గొన్నారు.

పది శాతం రాయితీతో అద్దెకు ఆర్టీసీ బస్సులు

సుభాష్‌నగర్, ఆగస్టు 8: శ్రావణమాసం పెళ్లి ముహూర్తాల నేపథ్యంలో తెలంగాణ ఆర్టీసీ సంస్థ మరో బంపర్ ఆఫర్‌ను ప్రకటించింది. ఆర్టీసీ బస్సులను అద్దె కోసం 10 శాతం రాయితీతో ఇవ్వనుంది. ఆగస్టు 6 నుంచి సెప్టెంబరు 3 వరకు బస్సులను అద్దెకు తీసుకున్న వారికి 10 శాతం రాయితీతో డిపాజిట్ లేకుండా ప్రయాణించే కాలానికి దూరానికి మాత్రమే చార్జీలు వసూలు చేయనున్నట్లు డిపో మేనేజర్ ఆనంద్ తెలిపారు. ఆర్టీసీ ప్రయాణం సుఖవంతమైన సురక్షితమైన ప్రయాణమని ప్రయాణికులు ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలని కోరారు.

నిజామాబాద్ జీజీహెచ్‌లో మలేరియా ప్రత్యేక వార్డు ఏర్పాటు


రోగులను పరిశీలిస్తున్న దృశ్యం

పెద్దబజార్, ఆగస్టు 8:జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మలేరియాకు సంబంధించిన ప్రత్యేక వార్డును ఏర్పాటు చేసినట్లు జిల్లా మలేరియా అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ తెలిపారు.జిల్లావ్యాప్తం గా రోజురోజుకు పెరుగుతున్న మలేరియా, డెంగీ, విషజ్వరాల పట్ల జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆసుపత్రిలో మలేరియా వ్యాధిన పడే వ్యాధిగ్రస్తుల కోసం ప్ర త్యేక వార్డును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వ్యాధిగ్రస్తు టలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రామడుగులో చోరీ

ధర్పల్లి, ఆగస్టు 8: మండలంలోని రామడుగు గ్రామంలో చోరీ జరిగింది. గ్రామంలోగల వేంకటేశ్వరస్వామి ఆలయం గర్భగుడిలో గల బీరువాను ధ్వంసం చేసి అందులో ఉన్న వస్తువులను అపహరించుకుపోయారు. స్వామివారి వెండి కిరీటం, అలంకరణ ఆభరణాలు చోరీకి గురయ్యాయి. బుధవారం సాయంత్రం పూజలు అనంతరం గుడికి తాళం వేసి గురువారం ఉదయం గుడి తెరువగా గుడిలో చోరీ జరిగినట్లు తెలుసుకున్న ఆలయ పూజారి గణపతి శ్రీనివాసశర్మ గ్రామస్థులకు వివరించారు. పూజారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. మండలంలో వరుస దొంగతనాలు జరుగుతున్నాయని మండల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో గల ఆలయాల్లో సైతం ఇటీవల చోరీలు జరిగాయి. మండల ప్రజలు తమ గ్రామాల్లో గుర్తుతెలియని వ్యక్తులు కనిపిస్తే తమకు సమాచారం ఇవ్వాలని ఎస్సై విక్రమ్ తెలిపారు. సంఘటన స్థలాన్ని పరిశీలించామని దొంగలను త్వరలోనే పట్టుకుంటామని ఆయన చెప్పారు.

108లో గర్భిణీ ప్రసవం

పెద్దబజార్, ఆగస్టు 8: జిల్లా కేంద్రానికి చెందిన ఓ గర్భిణీ 108 అంబులెన్స్‌లో ప్రసవించింది. దుబ్బ ప్రాంతానికి చెందిన దీపిక గర్భిణీ కాగా గురువారం ఉదయం నొప్పులు రావడంతో కుటుంబీకులు 108కు ఫోన్ చేశారు. దీంతో అంబులెన్స్ చేరుకోగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో నొప్పులు తీవ్రం కావడంతో పైలెట్ రమేష్, ఈఎన్‌టి శివదినేష్ ప్రసవం చేశారు. మహిళకు మగ శిశువు జన్మించారు.

విద్యార్థులు నైపుణ్యత అలవర్చుకోవాలి

డిచ్‌పల్లి,ఆగస్టు 8: తెలంగాణ యూనివర్సిటీ విద్యార్థులు ఇంగ్లీష్ పాఠ్యంశాలపై కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవాలని విద్యార్థులకు ఇంగ్లీష్‌పై మంచి పట్టు సాధించాలని ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఇంగ్లీష్ కు ఎంతో ప్రాధాన్యత ఉందని రిజిస్ట్రార్ యాదగిరి అన్నారు. గురువారం టీయూ బిజినెస్ మేనే జ్‌మెంట్ డిపార్టు మెంటులో కమ్యూనికే షన్ ఇంగ్లీష్‌పై జరిగిన వర్క్ షాపులో రిజిస్ట్రార్ మాట్లాడారు. ప్రపంచంలో ఏ దేశంలోనైనా ఇంగ్లీష్ అంశానికి అత్యధిక ప్రాధాన్యత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆరతి మాట్లాడుతూ.. విద్యార్థులంత కమ్యూనికేషన్ స్కిల్స్‌పై ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు అధ్యాపకుడు స్వామి, హెచ్‌వోడీ ఆంజనేయులు, డీన్ కైసరు మహమ్మద్, వాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.100	రూ.220	రూ. 240
వెన్‌కాబ్(కిలో)	రూ.105	రూ.225	రూ. 245

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.72000	రూ.66,400	రూ.840

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 :డెడ్‌పూల్(ఇంగ్లీష్3డీ) (10.00, 7.30)
: శివం భజే (1.00)
: కల్కి(తెలుగు 3డీ) (3.45) మురారి(10.30)
స్క్రీన్-2 : కమిటీ కుర్రాళ్లు (1.00, 7.25, 10.40, రాయన్: (4.15)
స్క్రీన్-3 : కేసు నంబర్ 15 (11.30)
: పాగల్ వర్సెస్ కాదల్ (1.55)
: సింబా (4.25), భవనం (7.10,10.10)
స్క్రీన్-4 : కమిటీ కుర్రాళ్లు (11.40)
: సంఘర్షణ (2.55)
: ల్యాండ్ మాఫియా (5.20)
:అలియా బసు గయాబ్‌హై (హిందీ)
: తుఫాన్ (10.40)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : కమిటీ కుర్రాళ్లు (10.50, 4.35, 7.40, 10.40)
: తుఫాన్ (1.50)
స్క్రీన్-2 : మురారి (10.15)
: భవనం (1.35)
: కల్కి(తెలుగు) (4.20)
: తుఫాన్ (7.40)
: రాయన్ (10.30)
స్క్రీన్-3 : మురారి (12.15, 3.40, 7.10, 10.35)

దేవి : కమిటీ కుర్రాళ్లు (11.15, 2.15)
రాయన్: (6.15, 9.15)
నటరాజ్ : భవనం (11.00, 2.00, 9.00)
మురారి (6.00)
విజయ్ : కల్కి (11.15, 2.15, 6.15)
: మురారి (9.15)

- నిజామాబాద్ అర్బన్